తగ్గిన కరెంట్ ఖాతా లోటు

క్యూ2లో 8.3 బిలియన్ డాలర్లు



ముంబై, డిసెంబర్ 26: వాణిజ్యలోటు దిగిరావడం, సర్వీసుల ఎగుమతులు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో భారత్ కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) భారీగా తగ్గింది. ఈ మూడు నెలల కాలంలో ఇది జీడీపీలో 1 శాతానికి (8.3 బిలియన్ డాలర్లు) చేరినట్టు మంగళవారం విడుదలైన రిజర్వ్‌బ్యాంక్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం జూలై-సెప్టెంబర్‌లో జీడీపీలో 3.8 శాతం (30.9 బిలియన్ డాలర్లు) క్యాడ్ నమోదయ్యింది. దేశంలోకి వచ్చి, పోయే విదేశీ మారక ద్రవ్యం మధ్య వ్యత్యాసాన్ని కరెంట్ ఖాతా లోటుగా వ్యవహరిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్‌లో ఇది జీడీపీలో 1.1 శాతం (9.2 బిలియన్ డాలర్లు). 2022-23 క్యూ2లో 78.3 బిలియన్ డాలర్లున్న వాణిజ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో 61 బిలియన్ డాలర్లకు తగ్గగా, సాఫ్ట్‌వేర్, బిజినెస్, ట్రావెల్ తదితర సర్వీసుల ఎగుమతులు 4.2 శాతం వృద్ధిచెందినట్టు ఆర్బీఐ తెలిపింది.

రెమిటెన్సులు 28 బిలియన్ డాలర్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న భారతీయుల నుంచి వచ్చిన రెమిటెన్సులు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 2.6 శాతం పెరిగి 28.1 బిలియన్ డాలర్లకు చేరాయి. దేశంలో పెట్టుబడుల ద్వారా వచ్చిన ఆదాయం చెల్లింపులు 11.8 బిలియన్ డాలర్ల నుంచి 12.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఖాతాలో నికరంగా 0.3 బిలియన్ డాలర్లు దేశం నుంచి తరలివెళ్లాయి. నిరుడు క్యూ1లో దేశంలోకి 6.2 బిలియన్ డాలర్లు తరలివచ్చాయి. ఇక విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు 6.5 బిలియన్ డాలర్ల నుంచి 4.9 బిలియన్ డాలర్లకు తగ్గాయి. కార్పొరేట్లు తీసుకున్న విదేశీ వాణిజ్య రుణాల మొత్తం 1.8 బిలియన్ డాలర్లు దేశంలోకి రాగా, గత ఏడాది ఈ ఖాతా నుంచి 0.5 బిలియన్ డాలర్లు వెలుపలికి వెళ్లాయి. ప్రవాసుల డిపాజిట్లు 2.5 బిలియన్ డాలర్ల నుంచి 3.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి. సమీక్షా త్రైమాసికంలో విదేశీ మారక నిల్వలు 2.5 బిలియన్ డాలర్లు పెరిగాయని ఆర్బీఐ వెల్లడించింది. నిరుడు ఇదే సమయంలో 30.4 బిలియన్ డాలర్ల నిల్వలు తరిగిపోయాయి. కమోడిటీ ధరలు పెరగకపోతే, ప్రస్తుత పూర్తి ఆర్థిక సంవత్సరంలో క్యాడ్ జీడీపీలో 1.5-1.6 శాతం మేర ఉండవచ్చని అంచనా వేస్తున్నట్టు ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ చెప్పారు.

ఫాక్స్‌కాన్‌కు అభయ హస్తం

ఆ సంస్థ ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ

కొంగరకలాన్‌లో పరిశ్రమకు గతంలోనే ఒప్పందం

సచివాలయంలో ఫాక్స్‌కాన్‌కు చెందిన హన్‌హాయ్ ప్రెసిషన్ ఇండస్ట్రీస్ ప్రతినిధి వీలీని సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. పారిశ్రామికవేత్తలకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. పరిశ్రమల అభివృద్ధి, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులను సులభంగా మంజూరు చేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఫాక్స్‌కాన్‌కు చెందిన హన్‌హాయ్ ప్రెసిషన్ ఇండస్ట్రీస్ ప్రతినిధి వీలీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొంగరకలాన్‌లో ఏర్పాటుచేస్తున్న ఫాక్స్‌కాన్ ఉత్పాదక కేంద్రం నిర్వహణకు, సంస్థ భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులకు కూడా ప్రభుత్వం తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎలక్ట్రానిక్స్ రంగం అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే..

తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ తెలంగాణలో పరిశ్రమ స్థాపనకు కేసీఆర్ ప్రభుత్వంతో గత మార్చిలోనే ఒప్పందం చేసుకున్నది. ప్రభుత్వం కొంగరకలాన్‌లో భూమిని కేటాయించగా, గత మేలో అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ఫాక్స్‌కాన్ మన రాష్ట్రంలో దశలవారీగా *550* మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నది. తద్వారా లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని, మొదటి దశలో, వచ్చే రెండేండ్లలో *25,000* ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఫాక్స్‌కాన్ సంస్థ ప్రధానంగా ఆపిల్ ఐఫోన్లను తయారుచేస్తుంది. సంస్థ ప్రధాన కస్టమర్లలో గూగుల్, జియోమీ, అమెజాన్, హ్యూలెట్ ప్యాకర్డ్, హ్యూవాయ్, సిస్కో, నెన్‌టెండో, సెగా అలీబాబా గ్రూప్, డెల్, ఫేస్‌బుక్, సోనీ, మైక్రోసాఫ్ట్, నోకియా తదితర కంపెనీలు ఉన్నాయి. చైనా, వియత్నాం, థాయ్‌లాండ్, మలేషియా, అమెరికా, యూరప్, భారత్ సహా *24* దేశాల్లో సంస్థ కార్యకలాపాలు సాగిస్తున్నది. మన దేశంలో శ్రీసిటీ (ఏపీ), శ్రీపెరంబదూర్(తమిళనాడు), తెలంగాణ(కొంగరకలాన్), బెంగళూరు(కర్ణాటక)లో పరిశ్రమలను ఏర్పాటుచేసింది.

నీరసించిన భారీ ఐపీవోలు

ఈ ఏడాది రూ.52,000 కోట్లకే పరిమితం

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది భారీ కంపెనీ (మెయిన్-బోర్డ్ ఐపీవో)ల పబ్లిక్ ఇష్యూల విలువ తగ్గుముఖం పట్టింది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)ల సంఖ్య పెరిగినా.. నిధుల సమీకరణ మాత్రం పడిపోయింది. ఈ ఏడాది 58 భారీ ఐపీవోలు రాగా, వాటి విలువ రూ.52,637 కోట్లుగా నమోదైంది. ఇందులో రూ.3,200 కోట్ల నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ రీట్ ఐపీవో కూడా ఉన్నది. అయితే నిరుడు 40 ఐపీవోలే వచ్చినప్పటికీ వాటి ద్వారా ఆయా సంస్థలు రూ.59,302 కోట్ల నిధులను సమీకరించాయి. కానీ ఇందులో మూడింటా ఒక వంతు (35 శాతం) ఒక్క ఎల్‌ఐసీ ఐపీవోదే కావడం గమనార్హం. ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఐపీవో విలువ రూ.20,557 కోట్లుగా ఉన్నది మరి. ఇక అంతకుముందు ఏడాది 2021లో 69 కంపెనీలు ఏకంగా రూ.1.2 లక్షల కోట్ల నిధులను చేజిక్కించుకున్నాయి. ఒక ఏడాది ఈ స్థాయిలో భారీ కంపెనీల పబ్లిక్ ఇష్యూల విలువ నమోదు కావడం ఇదే తొలిసారి. ఇది లావుంటే అంతర్జాతీయ మార్కెట్లలో ఒడిదుడుకులు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల వల్లే ఈసారి ఐపీవోల విలువ ఆశించిన స్థాయిలో లేదన్న అభిప్రాయాలు మార్కెట్ నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

2023 బిజినెస్ రివ్యూ

క్యూలో 24 కంపెనీలు

పబ్లిక్ ఇష్యూలకు సంబంధించి మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నుంచి అనుమతులు పొందినా.. ఐపీవోలకు ఇంకా రాని కంపెనీలు దాదాపు 24 ఉన్నాయి. వీటన్నిటి విలువ రూ.26,000 కోట్లపైనే. ఇక మరో 32కుపైగా సంస్థలు తమ డ్రాఫ్ట్ పేపర్లను సెబీ వద్దకు ఐపీవోల అనుమతి కోసం పంపించాయి. ఆమోదం లభిస్తే మార్కెట్ల నుంచి రూ.35,000 కోట్లకుపైగా నిధులను ఇవి సమీకరించే వీలున్నది. దీంతో అన్నీ అనుకూలిస్తే వచ్చే ఏడాది రికార్డు స్థాయిలో ఐపీవోలు మార్కెట్‌ను తాకడం ఖాయమన్న అంచనాలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ ఏడాది వచ్చిన ఐపీవోల్లో చిన్న, మధ్యతరహా సంస్థలవి 181 ఉన్నాయి. వీటి విలువ రికార్డు స్థాయిలో రూ.4,643 కోట్లు.

పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: బంగారం ధరలు మరింత పెరిగాయి. ఢిల్లీలో పది గ్రాముల బంగారం ధర మరో రూ.250 అందుకొని రూ.63,750 పలికింది. అంతకుముందు ఇది రూ.63,500గా ఉన్నది. పసిడితోపాటు వెండి ధరలు రూ.350 అధికమయ్యాయి. కిలో ధర రూ.79,100 నుంచి రూ.79,450 పలికినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇటు హైదరాబాద్‌లోనూ 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.220 అందుకొని రూ.63,710కి చేరుకోగా, 22 క్యారెట్ల ధర రూ.200 పెరిగి రూ.58,400 పలికింది. రూ.300 పెరిగిన కిలో వెండి రూ.81 వేల మైలురాయికి చేరుకున్నది.

భారత్‌పేఆదాయంలో వృద్ధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: ఫిన్‌టెక్ యూనికార్న్ భారత్‌పే ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.904 కోట్ల ఆదాయాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఉన్న రూ.321 కోట్ల ఆదాయం కంటే ఇది 182 శాతం అధికమని పేర్కొంది.

మూడో రోజూ ర్యాలీ

230 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్

ముంబై, డిసెంబర్ 26: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా తోడవడంతో మంగళవారం సూచీలు లాభపడ్డాయి. ఇంట్రాడేలో 350 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 229.84 పాయింట్లు పెరిగి 71,336.80 వద్ద ముగిసింది. హెవీవెయిట్ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లు లాభపడటంతో సూచీలు కదం తొక్కాయి. మరో సూచీ నిఫ్టీ కూడా 91.95 పాయింట్లు అందుకొని 21,441.35 వద్ద స్థిరపడింది.



- పవర్, యుటిలిటీ, బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్ రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లలో భారీగా క్రయవిక్రయాలు జరిగాయి
- ఎన్‌టీపీసీ 2.44 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- మహీంద్రా, విప్రో, కొటక్ బ్యాంక్, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, నెస్లె, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, రిలయన్స్, హెచ్‌యూఎల్, ఎల్‌అండ్‌టీ, ఐటీసీ, సన్‌ఫార్మా, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌లు పెరిగాయి.
- కానీ, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టాటా మోటర్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే యుటిలిటీ, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్, ఎనర్జీ, పవర్, హెల్త్‌కేర్, మెటల్, వాహన రంగ షేర్లు రెండు శాతం వరకు అధికమయ్యాయి.

గ్రీన్ ఎనర్జీలోకి రూ.9,350 కోట్లు

పెట్టుబడికి అదానీ కుటుంబం సిద్ధం

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: అదానీ గ్రూప్‌లోని గ్రీన్ ఎనర్జీ యూనిట్ 2030వ సంవత్సరానికల్లా 45 గిగావాట్ల ఉత్పాదక సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యంతో గౌతమ్ అదానీ కుటుంబం రూ.9,350 కోట్ల తాజా పెట్టుబడులకు సంకల్పించింది. ఈ పెట్టుబడులకు ప్రతిగా గౌతమ్ అదానీకి, ఆయన కుటుంబానికి వారెంట్లు జారీచేసే ప్రతిపాదనకు అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్) డైరెక్టర్ల బోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. ప్రమోటర్ గ్రూప్ సంస్థలైన ఆర్డోర్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్, అదానీ ప్రాపర్టీస్‌లకు ఒక్కో వారెంటు రూ.1,480.75 ధరతో 6.31 కోట్ల ప్రిఫరెన్షియల్ వారెంట్లను జారీచేయనున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ వెల్లడించింది. ఈ వారెంట్లు తదుపరి ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేస్తారు. దీంతో గ్రీన్ ఎనర్జీలో ప్రమోటర్లకు 3.8333 అదనపు ఈక్విటీ వాటా సమకూరుతుంది. తాజా పెట్టుబడులకు మూలధన వ్యయాలకు, రుణ చెల్లింపులకు వినియోగించనున్నట్టు ఏజీఈఎల్ పేర్కొంది. ఈ వార్త నేపథ్యంలో అదానీ గ్రీన్ ఎనర్జీ షేరు బీఎస్ ఈలో 4.3 శాతం పెరిగి రూ. 1,600 వద్ద ముగిసింది.

ఐఎస్ఎంపీ అధ్యక్షుడిగా ప్రభాకర్ రావు

హైదరాబాద్, డిసెంబర్ 26: ఇండియన్ షుగర్ అండ్ బయో ఎనర్జీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐఎస్ఎంఏ) నూతన అధ్యక్షుడిగా మండవ ప్రభాకర్ రావు నియమితులయ్యారు. ఆదిత్యా ఝున్‌ఝున్‌వాలా నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలో జరిగిన ఇండియన్ షుగర్ మిల్లర్ల అసోసియేషన్ 89వ వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అలాగే ఈ సమావేశంలో ఇండియన్ షుగర్ మిల్స్ పేరును ఇండియన్ షుగర్ అండ్ బయో ఎనర్జీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐఎస్ఎంఏ)గా మార్చివేశారు. ఐఎస్ఎంఏ ఉపాధ్యక్షుడిగా ధామ్‌పూర్ బయో ఆర్గానిక్స్ ఎండీ గౌతమ్ గోయల్ ఎంపికయ్యారు. ఎన్ఎస్ఎల్ షుగర్స్ సంస్థకు తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల్లో రోజుకు 40 వేల టన్నుల సామర్థ్యం కలిగిన చక్కెర యూనిట్లు ఉన్నాయి. వీటితోపాటు 150 మెగావాట్ల విద్యుత్ యూనిట్ కూడా ఉన్నది.

చిత్రం

ఉడిపిలో పోరాట ఘట్టాలు

నాగచైతన్య కథానాయకుడిగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'తండేల్'. మత్స్యకారుల నేపథ్య కథాంశమిది. సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్నది. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ కొద్ది రోజుల క్రితం కర్ణాటక ఉడిపిలో ప్రారంభమైంది. సముద్రం మధ్యలో హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ యాక్షన్ పార్ట్ రోమాంచితంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ సినిమా కోసం నాగచైతన్య సరికొత్త మేకోవర్‌తో సిద్ధమయ్యారు. మంగళవారం విడుదల చేసిన పోస్టర్‌లో నాగచైతన్య సముద్రం వైపు నడుస్తూ ఆనందంగా కనిపిస్తున్నారు. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, యాక్షన్ ప్రధానంగా సాగే ప్రేమకథా చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.

అట్లీ డైరెక్షన్‌లో యాక్షన్ అడ్వెంచరస్ మూవీ?

'పుష్ప' సినిమాతో బాలీవుడ్‌లో మంచి క్రేజ్‌ని సంపాదించారు బన్నీ. 'జవాన్'తో బాలీవుడ్ రికార్డులన్నీ చెల్లాచెదురు చేశాడు దర్శకుడు అట్లీ. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే, అభిమానుల్లో అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. త్వరలోనే ఈ కాంబినేషన్ సెట్ అవ్వనున్నట్టు ఫిలింవర్గాల సమాచారం. 'పుష్ప-2' తర్వాత బన్నీ త్రివిక్రమ్‌శ్రీనివాస్ దర్శకత్వంలో నటించనున్నట్టు వార్తలొచ్చాయి. అయితే, ఆ సినిమా కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో ఈ లోపు అట్లీతో సినిమా చేయడానికి అల్లు అర్జున్ రెడీ అయినట్టు తెలుస్తున్నది. ఈ యాక్షన్ అడ్వంచరస్ మూవీని సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని సంకల్పించారట దర్శకుడు అట్లీ. అనిరుధ్ సంగీత దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

నా రియల్ లైఫ్‌కు దగ్గరగా ఉంటుంది

'బబుల్‌గమ్' చిత్రం ద్వారా తెలుగులో కథానాయికగా అరంగేట్రం చేస్తున్నది మానస చౌదరి. రోషన్ కనకాల హీరోగా రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మానస చౌదరి మాట్లాడుతూ 'మోడలింగ్ రంగం ద్వారా నేను సినిమాల్లోకి ప్రవేశించాను. సినిమాల్లోకి వెళ్తానని చెప్పగానే మా ఫ్యామిలీ ఎంతగానో సపోర్ట్ చేశారు. 'బబుల్‌గమ్' కథ చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఈ సినిమాలో నేను జాన్వి అనే పాత్రలో కనిపిస్తా. తను ఫ్యాషన్ డిజైనర్. నా నిజ జీవితానికి కాస్త దగ్గరగా ఉండే పాత్ర ఇది. అందుకే ఫోటోషూట్ జరిగినప్పుడు నా లైఫ్‌కు సంబంధించిన కొన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కథలో బలమైన భావోద్వేగాలుంటాయి. తొలి చిత్రంలోనే అభినయానికి ఆస్కారం ఉన్న పాత్ర దక్కడం ఆనందంగా ఉంది. రోషన్ మంచి కోస్టార్. అతని ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నా. ప్రమోషన్స్ కోసం కాలేజీలకు వెళ్లినప్పుడు స్టూడెంట్ మా టీమ్‌ను చాలా గొప్పగా రిసీవ్ చేసుకున్నారు. నటిగా అన్ని జోనర్స్‌లో నటించాలనుంది. ఇప్పుడే ప్రయాణాన్ని ఆరంభించాను కాబట్టి.. కథల ఎంపికలో ఎలాంటి నిబంధనలు విధించుకోలేదు' అని చెప్పింది.

హృద్యంగా సాగే 'ప్రేమకథ'

కిషోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమకథ'. శివశక్తి రెడ్డి దర్శకత్వం వహించారు. జనవరి 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ సినిమా ఫస్ట్‌లుక్, ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. వైవిధ్యభరితమైన ప్రేమకథా చిత్రమిది. మనసుకు హత్తుకునే భావోద్వేగాలతో సాగుతుంది. నేటి యువతరాన్ని ఆకట్టుకునే అన్ని అంశాలుంటాయి. కథానుగుణంగా చక్కటి పాటలు కుదిరాయి' అన్నారు. రాజ్ తిరందాసు, వినయ్ మహదేవ్, నేత్రసాధు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వాసు పెండెం, సంగీతం: రధన్, నిర్మాతలు: విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్, రచన-దర్శకత్వం: శివశక్తి రెడ్డి.

కల్యాణ్‌రామ్

కొత్త కాన్సెప్ట్‌లకే ప్రాధాన్యతనిస్తా!

కథాంశాల ఎంపికలో కొత్తదనానికి పెద్దపీట వేస్తారు అగ్ర హీరో కల్యాణ్ రామ్. జయాపజయాలకు అతీతంగా విభిన్నమైన కాన్సెప్ట్‌లను ఎంచుకొని సినిమాలు చేస్తుంటారు. ఆయన కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కించిన తాజా చిత్రం 'డెవిల్ ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం కల్యాణ్‌రామ్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

తొలుత ఈ కథ విన్నప్పుడు 1940 నేపథ్యం చాలా కొత్తగా అనిపించింది. షెర్లాక్ హోమ్స్ సినిమాల తరహాలో సాగే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథాంశమిది. హీరో బేసిక్ క్యారెక్టరైజేషన్, బ్యాక్‌డ్రాప్ అలాగే ఉంచి కమర్షియల్ పంథాలో స్క్రిప్ట్‌లో మార్పులు చేయమని రచయిత శ్రీకాంత్ విస్సాకు సూచనలు చేశాను. చెప్పినట్లుగానే ఆయన స్క్రిప్ట్‌పై వర్క్ చేసి వాణిజ్య పంథాలో తీర్చిదిద్దారు. ఈ సినిమా మేకింగ్‌కు ఏడాది సమయం పట్టింది.

కమర్షియల్ గూఢచారి

కొత్త కాన్సెప్ట్‌లతో సినిమాలు చేయాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాను. ఒక్కోసారి వాటిలో కమర్షియల్ ఎలిమెంట్స్ లోపించడం వల్ల మిస్‌ఫైర్ అవుతుంటాయి. 'అమిగోస్' సినిమా విషయంలో అదే జరిగింది. ఆ కథను చెప్పే క్రమంలో కొన్ని వాణిజ్య అంశాలు మిస్ అయ్యాయి. అందుకే 'డెవిల్' సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సినిమాను రూపొందించాం. నా క్యారెక్టర్‌లో భారతీయత కనిపిస్తుంది. ఇప్పటివరకు వచ్చిన గూఢచారి కథల్లో ఇదొక వైవిధ్యమైన కథ.

దేశభక్తి అంశం ప్రధానంగా..

నా పాత్రలో ఎలాంటి నెగెటివ్ అంశాలు కనిపించవు. ప్రతీ విషయాన్ని డీటెయిల్డ్‌గా వర్క్ చేసి స్క్రిప్ట్ సిద్ధం చేశాం. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ హర్షవర్ధన్ రామేశ్వర్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుంది. హీరోయిన్లు సంయుక్తా మీనన్, మాళవికా నాయర్ పాత్రలకు కూడా చాలా ప్రాముఖ్యత ఉంటుంది. క్యారెక్టర్స్ విషయంలో నేను ప్రత్యేకమైన కసరత్తులు ఏమీ చేయను. క్యారెక్టర్ కొత్తగా అనిపిస్తే డైలాగ్ డెలివరీ మొదలుకొని, నటించే పద్ధతి వరకు అన్నీ మారిపోతాయి. ఈ సినిమాలో దేశభక్తి అంశం ప్రధానంగా ఉంటుంది. అదేమిటో సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

ప్రతీ విషయంలో పరిణితి వచ్చింది

మేము చేసే సినిమాలు గొప్పగా ఉండాలని నేను, తారక్ అనుకుంటాం. సినిమా అవుట్‌పుట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. తారక్ 'దేవర' విషయంలో గ్రేట్ ఎఫర్ట్స్ పెడుతున్నారు. నటుడిగా ఇరవై ఏండ్ల ప్రయాణం పూర్తయింది. ఈ ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నా. తండ్రిగా, భర్తగా, నటుడిగా కూడా గొప్ప పరిణితి సాధించానని భావిస్తున్నా. 'డెవిల్' సినిమాకు వచ్చే రెస్పాన్స్ చూసిన తర్వాత సీక్వెల్ గురించి ఆలోచిస్తాం.

శ్రియా రెడ్డి

అందమైన విలన్‌గా చూపించారు

ప్రభాస్ కథానాయకుడిగా ఇటీవల విడుదలైన పాన్ ఇండియా చిత్రం 'సలార్'లో నెగెటివ్ షేడ్స్ కలిగిన రాధా రమ పాత్రలో ప్రేక్షకులను మెప్పిస్తున్నది శ్రియా రెడ్డి. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకుపోతున్నది. ఈ సందర్భంగా మంగళవారం శ్రియా రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ 'తొలుత దర్శకుడు ప్రశాంత్‌నీల్ ఈ కథ చెప్పినప్పుడు వద్దన్నాను. ఆ సమయంలో నేను సినిమాలు చేయొద్దనే నిర్ణయం తీసుకొని ఉన్నా. అయితే ఓసారి స్క్రిప్ట్ విని నిర్ణయం తీసుకోమన్నారు. హీరో ఎవరైనా పర్లేదు, నా క్యారెక్టర్‌కు మాత్రం చాలా ప్రాధాన్యత ఉండాలని ప్రశాంత్‌నీల్‌తో చెప్పాను. రాధారమ పాత్రను డిజైన్ చేస్తున్నప్పుడే లుక్‌పరంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. విలనిజం ఉంటూనే అందంగా కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. విలనీ లుక్స్ ఎక్కువగా కనిపించొద్దని ఆభరణాలు, టాటూస్ వంటివి వొద్దనుకున్నాం. 'సలార్' తొలిభాగంలో కథను ఎస్టాబ్లిష్ చేసే ప్రయత్నం చేశాం. రెండో భాగం మరోస్థాయిలో ఉంటుంది. సెకండ్‌పార్ట్‌లో నా క్యారెక్టర్ నిడివి ఎక్కువగా ఉంటుంది. ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్. ఆయనతో పనిచేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. పవన్‌కల్యాణ్‌తో కలిసి నటిస్తున్న 'ఓజీ' సినిమాలో నా పాత్ర చాలా స్పెషల్‌గా ఉంటుంది. అయితే నెగెటివ్ రోల్ మాత్రం చేయడం లేదు. యాక్షన్‌తో పాటు బలమైన ఉద్వేగాలు ఉన్న కథ 'ఓజీ'. ఈ సినిమా తర్వాత నటిగా నేను రిటైర్ అయిపోతానేమ